క్లుప్తంగా

నేడు అబ్బిరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

యలమంచిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించేందుకు మంగళవారం ఉదయం మండలంలోని అబ్బిరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మికవేత్త రేపూరి మృతి


రేపూరి సూర్యనారాయణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక సూర్య ఫైనాన్స్ అధినేత, ఆధ్యాత్మిక వేత్త రేపూరి సూర్యనారాయణ(55) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రస్తుతం గోవిందస్వామి దీక్షలో ఉన్నారు. సూర్యనారాయణ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. గతంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఇన్‌చార్జ్ అధ్యక్షునిగా, ఫైనాన్స్ కంపెనీ అధ్యక్షునిగా, కాపు క్లబ్ ట్రెజరర్‌గా, మానవత సేవా సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. సూర్యనారాయణ మృతి పట్ల పట్టణ ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు, సేవా సంస్థల సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఘన సత్కారాలు


గాయకుడు సుబ్బారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

పెనుగొండ: తాడేపల్లిగూడెంలో కళావేదిక ఆధ్వర్యాన జరిగిన ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల్లో పెనుగొండ మండలానికి చెందిన గాయకుడు చివటం సుబ్బారావును, ప్రముఖ రచయిత గుండాల మహాలక్ష్మీలను ఘనంగా సత్కరించారు. ఈ మేరకు పెనుగొండలో సోమవారం విలేకర్లతో వారు మాట్లాడుతూ 30 గంటల పాటు నిర్విరామంగా పలు అంశాలపై నిర్వహించిన రికార్డును గుర్తించి అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, భారత్ టాలెంట్ రికార్డ్స్, ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టీఎస్ఏ, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో పేరు నమోదు చేస్తున్నట్లు ధృవీకరించి వారిని ఘనంగా సత్కరించారు. సత్కారం అందుకున్న సుబ్బారావు, మహాలక్ష్మిలను పలువురు అభినందించారు.

ఇంధనాన్ని ఆదా చేయాలి


ఈఈ అహ్మద్ ఖాన్

భీమవరం: భావితరాల అవసరాల కోసం ఇంధనాన్ని ఆదా చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎలక్ట్రికల్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ అన్నారు. స్థానిక విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ డీఈఈ రాజగోపాల్‌చౌదరి, ఏఈలు శ్రీనివాసరాజు, పద్మ, అప్పారావు, శ్రీనివాసరావు, ఆర్‌విడి రమణ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 4 అర్జీలు

ఆకివీడు: స్పందన కార్యక్రమానికి నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కె.వాణీ సోమవారం చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు. ఫిర్యాదుల్ని ఆయా శాఖల అధికారులకు పంపినట్లు వివరించారు.

పక్షవాత బాధితుడికి సాయం

భీమవరం: పక్షవాతంతో బాధపడుతున్న కొయ్యలగూడెం గ్రామానికి చెందిన తుపాకుల శ్రీనివాస్‌కి సోమవారం స్థానిక శ్రీనివాస థియేటర్ సెంటర్‌లోని తన కార్యాలయం వద్ద రూ.11 వేలు ఆర్థిక సాయం అందించామని కృష్ణ బలిజ సేవాసమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఘంటా త్రిమూర్తులు తెలిపారు. కార్యక్రమంలో గంటా నాగలక్ష్మి, తిప్పా ముత్యం, గంటా దుర్గారావు, బొక్కా అప్పారావు, యలమంచిలి శ్రీను, విన్నకోట వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాబ్జి మృతి తీరని లోటు

భీమవరం: ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆకస్మిక మృతి విద్యారంగానికి తీరనిలోట జనవిజ్ఞానవేదిక(జేవీవీ) జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ చుండూరి సాయిబాబు అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవనంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. సాబ్జి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు, నంద్యాల భాస్కరరాజు, జి.గోపిమూర్తి, జె.రామలక్ష్మణరావు, మల్లుల శ్రీనివాస్, రేపాక వెంకన్నబాబు, కె.సత్యలక్ష్మి, ఎ.జాన్సన్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల సంక్షేమం సాధ్యం


పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం కొత్తపేటలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ కవురు భారతి


పెనుగొండ: మండలంలోని సిద్ధాంతంలో వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణ చేస్తున్న పార్టీ నాయకులు


పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లంలో ఇంటింటా సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

పెనుగొండ: ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి విజయం సాధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు అన్నారు. సోమవారం సిద్ధాంతం సచివాలయం వద్ద నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో పాల్గొని సచివాలయం పరిధిలో అందించిన సంక్షేమ డిజిటల్ డైరీని, వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి రాముడు, ఎస్సీ, బీసీ సెల్ కన్వీనర్లు పలివెల శ్రీను, కాసాని శ్రీను, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వర్లు, యువజన విభాగం కార్యదర్శి కొనుకు శ్రీనివాస రావు(జెంట్రీ), ఎస్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

పెదమల్లంలో..

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఆచంట మండలం పెదమల్లంలో నిర్వహించారు. సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు ఇంటింటా తిరిగి అందించిన సంక్షేమాన్ని సీఎం జగన్ మరోసారి విజయం సాధించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కొండేటి సురేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించాలి

పాలకొల్లు అర్బన్: గత నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని కొత్తపేట సర్పంచ్ కవురు భారతి అన్నారు. పాలకొల్లు మండలం కొత్తపేట సచివాలయం వద్ద జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కష్టించి పనిచేయడం వలనే రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలను అందించగలిగామన్నారు. ప్రత్యక్ష ప్రయోజనాలుగా రూ.9,31,16,038, పరోక్ష పథకాల కింద రూ.2,56,32,176, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1,73,08,000 మొత్తం రూ.13,60,56,214 ప్రయోజనం కల్పించారన్నారు. కార్యక్రమంలో పార్టీ గౌరవాధ్యక్షుడు ఎం.మైఖేల్ రాజు, ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, గ్రామ నాయకులు కవురు భాస్కరబాబు, చీకటపల్లి స్వామిదాసు, కవురు గాంధీ, చింతపల్లి సత్యనారాయణ, పుచ్చకాయల చంద్రపాల్, వడ్లమూడి ఇస్సాక్, దిగమర్రు సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు రాపాక సునిబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, నోడల్ ఆఫీసర్ కేఎం వైభవతి, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశ రావు (రాజా) తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా షష్ఠి మహోత్సవం


పాలకొల్లు అర్బన్: పట్టణంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత గోపి


పెనుగొండ: నడిపూడిలో సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు


మొగల్తూరు: కోట రోడ్డులోని నాగ దేవత ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

మొగల్తూరు: శ్రీ వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మొగల్తూరు కోట రోడ్డులోని నాగ దేవత ఆలయం, ఉచ్చింత కాలువ, రామన్న పాలెం పంచాయతీ ఆంబోతుతిప్ప, ముత్యాలపల్లి, కాళీపట్నం, కోమటితిప్ప, కేపీ పాలెం, పేరుపాలెం, నీటితిప్పలోని ఆలయాల వద్ద స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయాల వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయాల వద్ద అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద, లిఖితపూడి, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు గ్రామాల్లో వేం చేసి యున్న శ్రీ వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి పువ్వులు, పడగ సమర్పించి పాలాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన తీర్థం దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. లక్ష్మణేశ్వరంలోని శ్రీ దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరుని పెద్దెత్తున భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు. వ్యాపారవేత్త చాగంటి మురళీకృష్ణ ఆర్థిక సహకారంతో అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో చాగంటి సురేష్ నాయుడు, చైర్మన్ కంకటాల పెద్దిరాజు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

పాలకొల్లు అర్బన్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లులోని గుణ్ణం వారి వీధిలో వేంచేసి యున్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం, సుబ్బారాయుడు గుడి సెంటర్ శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, శ్రీ శృంగేరి శంకర మఠం శ్రీ శంభేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, బ్రాడీపేట శ్రీ లక్ష్మీగణపతి, బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో వేకువజాము నుంచి అభిషేకాలు చేశారు. రాత్రి 7 గంటలకు సుబ్బారాయుడు గుడి నుంచి పట్టణ పురవీధుల్లో స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

మాజీ మంత్రి ప్రత్యేక పూజలు

పెనుగొండ: నడిపూడి, కొడమంచిలిలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో వేద పండితులు వేద ఆశీర్వచనం పలికారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్వామివారికి గ్రామోత్సవం

యలమంచిలి: మండలంలోని కొంతేరు, మేడపాడు, యలమంచిలి, దొడ్డిపట్ల, గుంపర్రు గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అర్చక స్వామి మానేపల్లి నీలకంఠం, ఈవో జి.లోకేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు.

పెనుమంట్రలో పోటెత్తిన భక్తులు

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ గ్రామంలో వేంచేసి యున్న శ్రీ ఉమా వాసకి రవి సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం షష్ఠి సందర్భంగా సోమవారం భక్తులతో పోటెత్తింది. ఆదివారం రాత్రి కల్యాణం నిర్వహించిన అనంతరం తెల్లవారు జామున భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరునికి, సోమేశ్వరునికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, రాధ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని గోశాలకు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ అర్చకులు కొండవీటి రామకృష్ణశర్మ, వాసుశర్మ, గణేష్, పవన్ ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

నేడు అయోధ్య శ్రీరాముని అక్షింతలు వితరణ

పాలకొల్లు సెంట్రల్: అయోధ్య శ్రీరామచంద్రుని పూజా అక్షింతలు పట్టణంలో మంగళవారం వితరణ చేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మహిళా విభాగ ప్రముఖ్ తొట్టెంపూడి సునీతాదేవి తెలిపారు. సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్యలో 2024 జనవరి 22వ తేదీన రామచంద్రమూర్తి గృహప్రవేశం చేయనున్నారన్నారు. దీనిలో భాగంగా ప్రతి హిందూ కుటుంబానికి అయోధ్య శ్రీరాముని స్పర్శ కలిగిన అక్షింతలు అందజేయాలనే నిర్ణయంతో మంగళవారం ఉదయం 9 గంటలకు స్థానిక బుధవారపు వీధి శ్రీ రామాలయంలో అక్షింతల ప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తటవర్తి కృష్ణమూర్తి, వీహెచ్‌పీ పట్టణ కార్యదర్శి అడ్డాల సూరిబాబు, కల్పన, భజరంగ్‌దళ్ ప్రముఖ్ భరత్, ప్రతాప్, శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


కొడమంచిలిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం ఆచంట మండలం కొడమంచిలిలో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో అనేక దీర్ఘకాల వ్యాధులను నయం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ రూ.5లక్షల నుంచి వైద్యానికి అయ్యే ఖర్చు రూ.25 లక్షల వరకూ నేరుగా ప్రభుత్వమే భరిస్తుందని పెంచడం ద్వారా పేదలకు అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. 108, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వైద్యాన్ని ఇంటికే చేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఎంపీడీవో నరసింహ ప్రసాద్, ఆచంట వేమవరం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సత్యవి, ఎంపీటీసీలు యల్లమెల్లి బేబీ రాజేష్, చిలుకూరి నాగ దుర్గాభవానీ నరేంద్ర, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనరు కొండేటి రమేష్, ఏఎంసీ డైరెక్టరు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, రావి నాగరాజు, పోలిశెట్టి వనమరాజు, రొక్కాల రాజ్‌కుమార్, గుబ్బల రామకృష్ణ, కడలి రాము, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల్లో మళ్లీ ఆందోళన

వాతావరణంలో మార్పులు


లక్ష్మణేశ్వరంలో తడిసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

నరసాపురం రూరల్: తుపాను ప్రభావంతో ముంపు బారిన పడిన చేలల్లోని ధాన్యాన్ని ఒబ్బిడి చేసేందుకు రైతులు పడుతున్న బాధలు గ్రామ గ్రామాన కానవస్తున్నాయి. మిగిలిన నాలుగు గింజలను ఒబ్బిడి చేసుకుందామనుకున్న రైతులకు కొన్ని రోజులుగా ఉపరితల ఆవర్తనం కారణంగా చలిగాలులు వీస్తుండటంతో ప్రతికూల వాతావరణం నెలకొంది. వాతావరణం చల్లగా ఉండటం, ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు తడిసిన ధాన్యం ఆరే మార్గం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయంపై మక్కువ చావని రైతులు చేలల్లో పడి మొలకవస్తున్న ధాన్యాన్ని సైతం అక్కడక్కడా ఒబ్బిడి చేసే పనులు చేపట్టినా వాతావణంలో వచ్చిన మార్పుల కారణంగా వీస్తున్న చలిగాలులకు తోడు ఎండ కూడా కానరాక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైన, కళ్లాల్లో తడిసిన ధాన్యం ఒబ్బిడి చేసుకునే రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

తాగునీరు కలుషితంపై ఆందోళన

నరసాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోందని ప్రజలు చెబుతున్నారు. స్థానిక 30, 31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేయకుండా తాగునీటిని కుళాయిల నుంచి వదులుతున్నారని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సెంట్రల జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ 2023–24 వివిధ పోటీ ల్లో స్థానిక శశి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 13 పతకాలు సాధించి సత్తా చాటారు. 400 మీటర్లు విభాగంలో ఎ.నాగ నందిని స్వర్ణ పతకం, 4 ఇన్ టూ 100 మీటర్లు విభాగంలో కె.గీతామాధురి, పి.స్వాతి స్వరూప, ఎ.నాగ నందిని, టి.హిమదుర్గలు స్వర్ణ పథకాలు సాధి ంచారు. 4 ఇన్ టూ 400 మీటర్లు పురుషులు విభాగంలో బి.తరుణ సాయి, ఎస్.సాయిరాం, జి.శివశంకర్ వరప్రసాద్, పి.చక్రమణికంఠ రజత పతకాలు సాధించారు. పురుషులు జావలిన్ విభాగంలో జి.నాగశ్రీనివాస రావు, 200 మీటర్లు పరుగుపెందెంలో కే.గీతా మాధురి, పదివేల మీటర్లు పరుగు పందెంలో జి.శివశంకర్‌వర ప్రసాద్‌లు రజత పతకాలు సాధించారు. పురుషులు 400 మీటర్లు పరుగు విభాగంలో పి.చక్ర మణికంఠ క్యాంస్య పథకం సాధించారు.

ప్రజారోగ్యమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం


ఉండిలో ఆరోగ్యశ్రీ బ్రోచర్లు విడుదల చేస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు, వైద్య సిబ్బంది

ఉండి: ప్రజల ప్రాణాలను కాపాడేందుకు జగన్‌మోహన్‌రెడ్డి మరో భరోసా ఇచ్చారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాల్యయంలో వైద్య సిబ్బంది సమక్షంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త బ్రోచర్‌ను ఎంపీపీ విడుదల చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షల వరకు పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ప్రజలంతా ఆయనకు జేజులు పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ప్రాణానికి సీఎం జగన్ భరోసాగా నిలుస్తూ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడం నిజంగా అద్భుతమని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో రూ.వెయ్యి దాటిని వైద్య సేవలు ఆరోగ్యశ్రీలోకి తీసుకురావడంతో పాటుగా ఇప్పుడు దాని పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచడం దేశానికే ఆదర్శంగా రాష్ట్రం నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అద్భుత అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కే కొండలరావు,వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏఎస్ఎన్ఎం కళాశాలలో ఆక్వా కల్చర్‌పై సెమినార్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జువాలజీ, ఆక్వా కల్చర్, కళాశాల ఐక్యూఏసీ సహకారంతో ఆక్వా కల్చర్ పురోగతి, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై జాతీయ సెమినార్ ఏర్పాటు చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాశాలలో ఏలూరులోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి వివిధ యూనివర్శిటీల నుంచి రిసోర్స్ పర్సన్స్ రావడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

సుబ్బారావు నియామకంపై హర్షం

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర సమగ్ర శిక్ష ఆర్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పట్టణానికి చెందిన పండా సుబ్బారావు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని బాలకేంద్రంలో క్రాఫ్ట్ ఉపాధ్యాయునిగా పనిచేసిన సుబ్బారావును ఎంపిక చేయడం పట్ల సహచర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీకి తనను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. యూనియన్ సభ్యులతో కలిసి సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

భగవద్గీతపై ప్రచారం

ఉండి: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక భీమవరం కమిటీ చైర్మన్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉండిలో పలువురు సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో భగవద్గీత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవ, చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు ఘన సత్కారం

ఉండి: చెరుకువాడలో బాప్టిస్ట్ చర్చి కౌన్సిల్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్లు పాస్టర్ రెవరెండ్ ఎస్ జార్జ్‌ముల్లర్ సోమవారం తెలిపారు.ఉండి, కాళ్ల మండలాలకు చెందిన అర్తమూరు, చెరుకువాడ చినపేట, పెదపేట, ఇమ్మానుయేలుపేట, కలిసిపూడి, కోలనపల్లి పెదపేట, గరువుపేట గ్రామాల్లోని చర్చిల ప్రతినిధులు ఈ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాస్టర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం పాస్టర్ జార్జ్ ముల్లర్ క్రీస్తు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల చర్చి సీఆర్‌లు, ట్రెజరర్స్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉండి: వెలివర్రులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం బావాయిపాలెంకు చెందిన వడ్డి నాగరాము ఉండి మండలం వెలివర్రులో వీరపేరంటాలమ్మ గుడికి ఆదివారం వచ్చాడు. గుడి వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో ఏపీ 39 డీజే 7991 నంబరు వాహనం అతణ్ని వేగంగా ఢీ కొట్టింది. నాగరాము కుడి కాలు విరగడంతో పాటుగా తల వెనుక గాయాలయ్యాయి. అతణ్ని హుటాహుటిన భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఏఎస్సై ఏ సూర్యనార్యాయణ సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి


డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భీమవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ సమస్యలు పరిష్కారించాలని డీఆర్వో బి.శ్రీమన్నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలని, అర్హులైన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించి జూనియర్ ఎఫ్ఏఎల్‌లకు ఎఫ్ఏఎల్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పీవీ ప్రతాప్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తేలి శాంతి స్వరూప్, నాయకులు భవాని, రమేష్, ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, అబ్రహం, కేపీ రాజు, మహేష్ రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.